

కాకినాడ పోర్టులో మరో రెండు చెక్‌పోస్టులు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల

- 7లో

ఈనెల 20 నుంచి ఓటర్ల సర్వే

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు13: ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితా తయారీలో భాగంగా ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్‌యాదవ్ అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ సజావుగా చేపట్టాలన్నారు. అక్టోబరు 19 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. అక్టోబరు 29న సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించడం జరుగుతుందన్నారు. సెప్టెంబరు 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురం పట్టణంలోని అన్నక్యాంటీన్ భవనం

జిల్లాలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన 8 అన్నక్యాంటీన్లు

కాకినాడ నగరంలో 5, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో మరో మూడు క్యాంటీన్లు ప్రారంభం

పిఠాపురం, ఆగస్టు 13: పేదవారికి కడుపు నిండా అన్నం పెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన అన్నక్యాంటీన్లను ఈనెల 15వ తేదీన ప్రారంభించనున్నారు. జిల్లాలో మొత్తం ఎనిమిది అన్నక్యాంటీన్లు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పేద, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజలు, చిరువ్యాపారులు, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునేవారు, కార్మికుల నుంచి విశేష ఆదరణ పొందిన అన్నక్యాంటీన్లు తిరిగి అందుబాటులోకి రానున్నాయి. టీడీపీ హయాంలో వీటిని విజయవంతంగా అమలుచేయగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నక్యాంటీన్లను మూసివేశారు. భవనాలను నిరుపయోగంగా మార్చారు. పలుచోట్ల ఇతర అవసరాలకు వినియోగించారు. రాష్ట్రంలో మళ్లీ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా అన్నక్యాంటీన్లు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు వీటిని ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీనికి అనుగుణంగా అన్నక్యాంటీన్ భవనాల ఆధునీకీకరణకు నిధులు కేటాయించి పనులు నిర్వహించారు. క్యాంటీన్ భవనాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. కాకినాడ నగరంలోని అన్నమ్మఘాటీ జంక్షన్, డెయిరీ మార్కెట్, సంతచెరువు, సర్పవరం జంక్షన్, వివేకానంద పార్కు వద్ద ఉన్న అన్నక్యాంటీన్లతోపాటు పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోటల్లో అన్నక్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి.

హోటల్స్‌లో ఆహారం కల్తీమయం

- కల్తీ ఆహారం.. రేట్లు అమోఘం
- కల్తీ ఆయిల్, నిల్వ మాంసంతో ప్రజా ఆరోగ్యంతో చెలగాటం
- ధనార్జనే ధ్యేయంగా హోటల్ నిర్వాహకులు



కుళ్లిన కోడిగుడ్లతో వంటకం

తుని రూరల్, ఆగస్టు13: ఆహార కల్తీ అనేక అనారోగ్య పరిస్థితులను తెచ్చిపెడుతోంది. ముఖ్యంగా కల్తీ ఆయిల్, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలతో చేసిన వంటకాలతో వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. తేటగుంట జాతీయ రహదారిని ఆనుకుని పుట్టగొడుగుల్లా ఫ్యామిలీ రెస్టారెంట్లు వెలిశాయి. అటు విశాఖపట్నం నుంచి, ఇటు హైదరాబాద్ నుంచి వచ్చే బస్సులు, వాహనాల డ్రైవర్లతో కమిషన్లకు మాట్లాడుకోవడంతో తేటగుంట హోటల్స్ వద్ద పెద్దఎత్తున బస్సులు ఆగుతూ ఉంటాయి. ప్రయాణికులు సంబంధిత హోటల్ నిర్వాహకులు, బస్ డ్రైవర్లు ఈ ప్రాంతంలోనే భోజనాలుకానీ, టిఫిన్లుకానీ ముగించుకోవాలని.. మరెక్కడా వాహనాలు ఆపబోమని చెప్పడంతో ప్రయాణికులు ఈ హోటళ్లలోనే తినాల్సి వస్తోంది. ఇదే అదునుగా చేసుకుని కొందరు హోటల్ నిర్వాహకులు కల్తీ అయిల్, నిల్వ మాంసాలను వినియోగించిన వంటకాలు వడ్డిస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇదేమిటని అడిగితే ఆయా వ్యాపారులు ఎదురు దాడికి దిగుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. హోటళ్ల నిర్వాహకులు నిబంధనలకు నీళ్లొదిలి, ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. దీనికితోడు వాహన డ్రైవర్లకు కమీషన్ ఇచ్చి.. ఇటు అధిక రేట్లతో ప్రయాణికులను నిలువుదోపిడీ చేస్తున్నట్టు వారు విమర్శిస్తున్నారు.



వైరా హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు

తేటగుంటలో ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారుల దాడులు

తుని రూరల్, ఆగస్టు13: తేటగుంట జాతీయ రహదారిని ఆనుకుని నిర్వహిస్తున్న వైరా హోటల్‌లో ఫుడ్‌అండ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ప్రయాణికుల నుంచి వరుస ఫిర్యాదులతో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్టు తెలుస్తోంది. జిల్లా ఫుడ్ అండ్‌సేఫ్టీ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైరా హోటల్‌లో నిర్వహించిన తనిఖీల్లో వండి వడ్డిస్తున్న వంటకాల్లో నాణ్యతా లోపాలు గుర్తించినట్టు తెలిసింది. హోటల్ నిర్వాహకుడికి నోటీసులు జారీచేసి పలు ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఫుడ్‌అండ్ సేఫ్టీ నిబంధనలు హోటల్ నిర్వాహకులు తూచ తప్పకుండా పాటించాలని, పలు రకాల క్యాన్సర్‌లకు కారణమవుతున్న కల్తీ ఆయిల్స్, టేస్టింగ్ సాల్ట్, కలర్స్‌ను వినియోగిస్తే చర్యలు తప్పవని ఫుడ్‌అండ్‌సేఫ్టీ అధికారి శ్రీనివాస్ తెలిపారు.



అంబరాన్ని తాకేలా.. తిరంగా పండుగ

- స్వాతంత్ర్య దినోత్సవానికి ఇచ్చే మొత్తాలు భారీగా పెంపు
- మైనర్ పంచాయతీలకు రూ.10 వేలు, మేజర్‌కు రూ.25 వేలు
- నిధుల పెంపుపై గ్రామాల్లో సర్వత్రా హర్షామోదాలు
- గతంలో కేవలం రూ.100, రూ. 250 మాత్రమే
- మూడున్నర దశాబ్దాలుగా ఇదే పరిస్థితి
- విశిష్టత ఉట్టిపడేలా ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు
- విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు
- గణతంత్ర దినోత్సవానికీ ఇదే రీతిలో నిధులు

గ్రామాల్లో అంబరాన్ని తాకేలా తిరంగా పండుగ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పంచాయతీలకు ఈ వేడుకల నిమిత్తం ఇచ్చే మొత్తాలను ఒకేసారి వంద రెట్లు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మూడున్నర దశాబ్దాలుగా మూసపద్ధతిలో ఉన్న నిధుల కేటాయింపును మార్చుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ జారీచేసిన ఆదేశాలతో ఘనంగా స్వాతంత్ర వేడుకల నిర్వహణకు గ్రామ పంచాయతీలకు వీలు చిక్కనున్నది. జెండా పండుగ విశిష్టతను చాటేలా ఉత్సవాలు నిర్వహించాలని, ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ తదితర అంశాల్లో పోటీలు జరపాలని మార్గదర్శకాలు జారీ చేశారు.

పిఠాపురం, ఆగస్టు 13: స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవాలు వచ్చాయంటే గ్రామాల్లో ఒకప్పుడు పండుగలా ఉండేది. ఎక్కడిక్కడ జాతీయ పతాకాల ఆవిష్కరణలు, స్వీట్లు పంపిణీ, జాతీయ జెండాలతో చిన్నారులు చేసే సందడి అంతా ఇంతా కాదు. రాను రాను ఇవి ఏదొక కార్యక్రమం అన్నరీతిలో తయారైంది. పంచాయతీల వద్ద నిధులు లేకపోవడంతో దాని ప్రభావం ఉత్సవాల నిర్వహణపై పడింది. నిధులు ఉండి ఖర్చు పెడదామన్నా అందుకు అవకాశం లేని పరిస్థితులు. స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణకు మైనర్ పంచాయతీలకు (అయిదు వేల లోపు జనాబా ఉంటే) రూ.100, మేజర్ పంచాయతీలకు (5వేల కంటే అధిక జనాబా ఉన్న) రూ.250 మాత్రమే వ్యయం చేయడానికి అనుమతులు ఉన్నాయి. మూడున్నర దశాబ్దాల కిందట నిర్ణయించిన ఈ పరిమితే ఇప్పటివరకూ కొనసాగుతోంది. దీంతో ఉత్సవాల నిర్వహణ భారం పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులపై పడింది. దీంతో వారు పంచాయతీ వద్ద జెండా ఎగురవేసి చాక్లెట్లు లేదా స్వీట్లు పంపిణీ కార్యక్రమం అయిందనిపిస్తున్నారు. గత వైసీపీ పాలనలో ఇదే విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోలేదు. పంచాయతీల వద్ద ఉన్న నిధులను లాక్కోవడానికి ప్రాధాన్యమిచ్చిన నాటి ప్రభుత్వ పెద్దలు ఈ విన్నపాలను పక్కన పెట్టేశారు. దాంతో ఈ విన్నపాలు మరుగునపడ్డాయి.

జాతీయ పండుగలకు పెద్దపీట వేస్తూ...

జాతీయ పండుగలుగా ఉన్న స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను దేశానికి పట్టుగొమ్మలు అయిన గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావించింది. ఈ ఉత్సవాల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, నిధులు వ్యయానికి ఉన్న అనుమతులు గురించి రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు ఇటీవల రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి వివరించారు. ఆయన వెంటనే స్పందించి పంచాయతీల్లో ఉత్సవాల నిర్వహణకు ఇస్తున్న మొత్తాలపై ఆరా తీశారు. మైనర్, మేజర్ పంచాయతీల్లో ఉత్సవాలకు కేవలం రూ.100, 250 వ్యయం చేయడానికి మాత్రమే అనుమతి ఉండడంతో విస్మయం వ్యక్తమైంది. ఈ నిధులతో వేడుకలు ఎలా చేయగలరని ఆయన అధికారులను ప్రశ్నించారు. దీంతో తక్షణం చొరవ తీసుకుని మైనర్ పంచాయతీలకు స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణకు ఇస్తున్న మొత్తాన్ని రూ.100 నుంచి రూ.10 వేలకు, మేజర్ పంచాయతీలకు రూ.250 నుంచి రూ.25 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. గణతంత్ర దినోత్సవానికి కూడా ఇదే పద్ధతిలో నిధుల వ్యయానికి అనుమతులు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులకు పోటీలు.. సమరయోధులకు సత్కారం

స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ విశిష్టత ఉట్టిపడేలా గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో కార్యక్రమాల నిర్వహణ ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామపంచాయతీల వద్ద జెండా వందనం, చాక్లెట్లు పంపిణీతో కార్యక్రమాన్ని ముగించకుండా ఏయే కార్యక్రమాలు నిర్వహించాలో, అందుకు ముందస్తుగా ఎటువంటి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలో ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. స్వాతంత్ర దినోత్సవ విశిష్టత, రాజ్యాంగ విలువల, స్థానిక సంస్థల పరిపాలన తదితర అంశాలపై ఆయా గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖనం, క్రీడలు తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందించాలి. ఇందులో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను భాగస్వాములు చేయాలని ప్రభుత్వం సూచించింది. అదేవిధంగా పంచాయతీ పరిధిలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధులు, రక్షణరంగంలో పనిచేసినవారిని, పారిశుధ్య కార్మికులను సత్కరించాలని నిర్దేశించారు. అదే విధంగా పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లలకు మిఠాయిలు లేదా చాక్లెట్లు పంపిణీ చేయాలని సూచించారు. పారిశుధ్యంపై మహాత్మాగాంధీ చెప్పిన మాటలతో పంచాయతీ వద్ద, పాఠశాలల్లో విద్యార్థులతో ప్రమాణం చేయించడం ద్వారా వారిలో స్ఫూర్తి నింపాలని నిర్దేశించారు. ఇదే రీతిలో గణతంత్ర దినోత్సవం చేపట్టాల్సి ఉంటుందని ప్రభుత్వ మార్గదర్శకాల్లో స్పష్టంచేశారు.

ఊరంతా పండుగలా..

స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను ఇకపై ఊరంతా పండుగలా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో కాకినాడ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో తొలుతగా వచ్చే ఆగస్టు 15న ఇండిపెండెన్స్ డే నిర్వహణపై అధికారయంత్రాంగం దృష్టి సారించింది. సర్పంచ్‌లతో సమన్వయం చేసుకుంటూ పంచాయతీల్లో కార్యక్రమాల నిర్వహణపై కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా ఈ వేడుకలు పర్యావరణహితంగా జరగాలని సూచనలు ఇచ్చారు. ఎక్కడా ప్లాస్టిక్ జెండాలు, పర్యావరణానికి హాని కలిగించే వాటిని వినియోగించరాదని స్పష్టంచేశారు. చేనేత కళాకారులు తయారు చేసిన జెండాలను వినియోగించాలని సూచించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో గ్రామాల్లో మువ్వన్నెల జెండాలు రెపరెపలాడనున్నాయి.





రమణయ్యపేటలో అద్దె భవనంలో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం... పైడావారి వీధిలో వైసీపీ కార్యాలయం భవనం

పరాయి పంచన వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం

రెండు దశాబ్దాలుగా అద్దె భవనంలో కొనసాగింపు

వైసీపీ భవనం కేటాయించాలని డిమాండు

ఈ స్థలం కోసం ప్రతిపాదనలు


సర్పవరం జంక్షన్, ఆగస్టు13: ప్రభుత్వానికి ఆదాయాన్నందించే వాణిజ్య పన్నులశాఖకు సొంత భవనం లేక పరాయి పంచన కొనసాగుతోంది. అధికారుల ముందుచూపు లేక రెండు దశాబ్దాలకుపైగా అద్దె భవనం నుంచే అధికారులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. పూర్వం నిర్ధారించిన అద్దె సరిపోదంటూ, అద్దె పెంచాలని లేదంటే ఖాళీ చేయాలంటూ భవన యజమాని ఒత్తిడి తెస్తుండడంతో అధికారులు సతమతమవుతున్నారు. సొంత భవనం కోసం రెండేళ్ల కిందట పైడావారి వీధిలో ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలాన్ని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయానికి కేటాయించాలని కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఇందుకు అనుమతించడం, తీర్మానం కోసం కార్పొరేషన్‌కు ఫైల్ పంపడం వంటి పనులు చకచకా జరిగిపోయాయి. ఇంతలో వైసీపీ కార్యాలయానికి స్థలం కావాలని, ఇందుకు వాణిజ్య పన్నులశాఖ కోరిన స్థలాన్ని కేటాయించాలంటూ వైసీపీ నాయకులు కలెక్టర్‌కు ప్రతిపాదించారు. ముందుగా కోరిన వాణిజ్య పన్నుల శాఖకు స్థలం కేటాయించకుండా రాజకీయ ఒత్తిళ్లతో వైసీపీ జిల్లా కార్యాలయానికి స్థలం లీజుకు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఓటమిచెందడం, వైసీపీ భవనానికి ఎటువంటి అనుమతులు లేవని, అక్రమ నిర్మాణంపై కార్పొరేషన్ అధికారులు నోటీసు అంటించారు. స్థలం కేటాయించే వరకు ప్రత్యామ్నాయంగా వైసీపీ భవనాన్ని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయానికి కేటాయించాలని అధికారుల ప్రతిపాదిస్తున్నారు. ఈ భవనం అసంపూర్తిగా వదిలేసేదానికంటే తమకు కేటాయించాలని వారు కోరుతున్నారు. జిల్లా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో ఉంది. ప్రైవేట్ భవన సముదాయంలో 2003లో ఏర్పాటుచేశారు. నెలకు 1,04,186 అద్దెతో కొనసాగుతోంది. వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో మొదటి అంతస్తులో డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, రెండో అంతస్తులో అసిస్టెంట్ కమిషనర్ (ఇంటిలిజెన్స్) కమర్షియల్ టేక్స్ సర్కిల్ కార్యాలయం (కాకినాడ పోర్టు), మూడో అంతస్తులో వాణిజ్య పన్నులశాఖ కాకినాడ సర్కిల్ కార్యాలయం, 4వ అంతస్తులో వాణిజ్య పన్నులశాఖ జగన్నాథపురం సర్కిల్, 5వ అంతస్తులో కాన్ఫరెన్స్ హాలు, గ్రౌండ్ ఫ్లోర్‌లో జీఎస్టీ సేవా కేంద్రం ఉన్నాయి. ఈ కార్యాలయాల నుంచి సుమారు 150 మంది వరకు వాణిజ్య పన్నులశాఖ అధికారులు, సహాయ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వాణిజ్య పన్ను, వస్తువులు, సేవల అమ్మకాలు, కొనుగోలు, మార్పిడిపై పన్నులు వసూలు చేసి ప్రభుత్వానికి ఆదాయం సంపాదించిపెడుతుంటారు. వినయోగ ఆధారిత, స్థూల జాతీయోత్పత్తి పన్ను, సేల్స్ ఆధారిత వాణిజ్య, ఎక్సైజ్ ఆధారిత పన్ను, వ్యాట్‌ఆధారిత పన్ను, వినియోగ ఆధారిత పన్ను తదితర పన్నుల వసూలు చేయడం, వినియోగదారులకు పన్నుల చెల్లింపుపై అవగాహన కల్పిస్తూండడం అధికారులు చేస్తూంటారు. సక్రమంగా పన్నులు చెల్లించేలా తనిఖీలు చేపట్టడం చేస్తూంటారు. జీఎస్టీ సేవా కేంద్రం ఏర్పాటు చేసి వినియోగదారులకు అవగాహన కల్పించడం, ఈఫైలింగ్‌పై అవగాహన కల్పించి పన్నులు సక్రమంగా ప్రభుత్వానికి కట్టేలా విధులు నిర్వహిస్తూంటారు. కోట్లాది రూపాయలను వివిధ పన్నుల రూపాల్లో ప్రభుత్వానికి ఆదాయాన్ని అందిస్తూంటారు. ఇంత ముఖ్యమైన వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి సొంత భవన నిర్మాణం కోసం స్థలం కేటాయింపులో అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు ఉదాశీన వైఖరితో ఏళ్ల తరబడి పరాయి పంచన కొనసాగుతోంది. అద్దె పెంచాలని లేదంటే భవనం ఖాళీ చేయాలంటూ భవన సముదాయం యజమాని అధికారులను కోరుతున్నాడు. గత రెండేళ్ల నుంచి ఒత్తిడి రావడంతో అధికారులు అద్దె భవనాలు, ఖాళీ స్థలాల గుర్తింపు పనిలో ఉన్నారు. కాకినాడ 49వ డివిజన్ పైడా వారి వీధిలో సర్వే నెంబర్ 155/2, 7బీలోని రెండు ఎకరాల స్థలం ఆర్‌అండ్‌బీకి చెందినది ఉంది. ఈ స్థలాన్ని తమకు కేటాయించాలంటూ రెండేళ్ల కిందట ఈ శాఖ కలెక్టర్‌ని కోరింది. సమ్మతిని తెలియజేస్తూ కలెక్టర్ ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. నగరపాలక సంస్థలో గెజిట్ నోటిఫికేషన్ కోసం తీర్మానం చేసివ్వాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఇంతలో వైసీపీ జిల్లా కార్యాలయం కోసం కేటాయించాలంటూ కలెక్టర్‌కు దరఖాస్తు పెట్టుకోవడం, కేటాయించడం జరిగిపోయాయి. ఎకరా స్థలం ఏడాదికి రూ.1000 లీజు కింద 33 ఏళ్లకు అప్పన్నంగా కట్టబెట్టేశారు. ఆధునిక హంగులతో భవన సముదాయాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్మించేసింది. వైసీపీ భవనానికి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవని కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారులు గుర్తించారు. ఈ భవనాన్ని తాత్కాలికంగా వాణిజ్య పన్నులశాఖ కార్యాలయ సముదాయానికి కేటాయించాలని అధికారులు కోరుతున్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న కాకినాడ జిల్లా ఎస్టీయూ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలపై డీఈవోకు ఎస్టీయూ వినతి

కాకినాడ రూరల్, ఆగస్టు 13: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ కాకినాడ జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఈవో పిల్లి రమేష్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్వహణపై ఇచ్చిన డీఈవో మౌఖిక ఆదేశాలను విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందుల దృష్ట్యా పునఃపరిశీలించాలన్నారు. డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయులను పని సర్దుబాటులో భాగంగా అదే పాఠశాలలో కొనసాగించాలని, ప్రాధాన్యత కేటగిరీలో బదిలీపొందిన ఉపాధ్యాయులకు అదే మండలంలో సర్దుబాటు చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమంచి కాశీవిశ్వనాథ్, కార్యవర్గ సభ్యులు రాజు, సుబ్బరాజు, శ్రీను, పల్లంరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న

గాంధీజీ చిత్రం

బ్రిటీషు వారిని ఎదురించి భారతదేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు గాంధీజీ. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈదరాడ హైస్కూలు డ్రాయింగ్ టీచరు బత్తుల శ్రీనివాస్ ఆయిల్ పెయింట్‌తో గీసిన మహాత్ముని చిత్రం ఆకట్టుకుంది. శ్రీనివాస్‌ను హెచ్ఎం జి.సాయిబాబుతో పాటు సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

- మామిడికుదురు

చింతలమోరిలో 300 మీటర్ల జెండా ప్రదర్శన



చింతలమోరిలో భారీ జాతీయ జెండాను ఊరేగిస్తున్న విద్యార్థులు

మలికిపురం, ఆగస్టు 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం చింతలమోరిలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డొక్కా నాథ్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం హైస్కూలు విద్యార్థులు 300మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. జాతీయతా భావాన్ని పెంపొందించడానికి ప్రధాని పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టినట్టు నాగబాబు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, అడబాల సత్యనారాయణ, అడబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

336 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ



336 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెద్దాపురం, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాకినాడజిల్లా పెద్దాపురంలో 336 అడుగుల జాతీయ జెండాను విద్యార్థులు మంగళవారం ప్రదర్శించారు. ఈ భారీ జెండాను పట్టణ వీధుల్లో ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లి స్థానిక మున్సిపల్ జంక్షన్‌వద్ద మానవహారంగా ఏర్పడి జాతీయజెండాను ప్రదర్శించారు. ఈ జెండా ప్రదర్శన కార్యక్రమంలో ఎస్ఐ మౌనిక పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతీఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు.

ఇసుక కొరత తీరేదెప్పుడో?



- 17 డీసిల్టేషన్ ర్యాంపుల గుర్తింపు... ఇంకనూ లభించని అనుమతులు
- ఇరిగేషన్‌కు బ్యారేజీ నుంచి ఫోర్త్ బ్రిడ్జిలోపు ర్యాంపుల నిర్వహణ
- ఫోర్త్ బ్రిడ్జి అవతల మైన్స్‌కు అప్పగింత ● ఈ వారంలో మొదలు కానట్టేనా?
- ఇసుకకు వినియోగదారుల ఎదురుచూపు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించాయి. జూలై 8 నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చినప్పటికీ, ఇంకా ఇసుక తీత మొదలు కాలేదు. గత ప్రభుత్వం హయాంలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వేసి, మళ్లీ వాళ్ల ప్రభుత్వమే వస్తుందనే దురాశతో జిల్లాలో పలు చోట్ల ఇసుకను స్టాక్ చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక విధానం ప్రకటించి మొదట ఈస్టాక్ పాయింట్లలోని ఇసుకను సరఫరా చేశారు. జిల్లాలో ఇంచు మించు ఇసుక స్టాక్ అయిపోయినట్టే. రాజమహేంద్రవరం డివిజన్‌లో అసలు లేదు. కొవ్వూరు డివిజన్‌లో కూడా రేపోమాపో అంతా ఖాళీ. ఈ పరిస్థితులలో ఇసుక కొరత లేకుండా చూడాలని ప్రభుత్వం, జిల్లా ఇసుకకమిటీ ప్రయత్నాలు చేస్తోంది. కానీ నిబంధనలు అడ్డు వస్తున్నాయి. వీటిపై స్పష్టత రాగానే కొంతమేరైనా ఇసుక తీత తీసే అవకాశం ఉంది. ప్రస్తుతం వరద కారణంగా ఓపెన్ రీచ్‌ల జోలికి వెళ్లడంలేదు. ఇసుక కొరత లేకుండా చూడడం కోసం అఖండ గోదావరిలో డీసిల్టేషన్ ద్వారా ఇసుకతీసి సరఫరా చేయడానికి నిర్ణయించారు. రాజమహేంద్ర వరం, కొవ్వూరు ప్రాంతాల్లో మొత్తం 17డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. వీటిని ఎవరికి అప్పగించాలి, ఎవరితో ఎలా ఇసుక తీయించాలనే దానిపై స్పష్టతకు అధికారులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం ఈ పాయింట్లను క్లస్టర్లుగా విభజించి, ఆన్‌లైన్ టెండర్లు పిలవాలని చూస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గోదావరి ఫోర్త్ బ్రిడ్జి అయిన గామన్‌బ్రిడ్జి వరకూ రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల మధ్య అఖండగోదావరిలో డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా ఇసుక టెండర్లు పిలవడం, తీయించడం, సరఫ రా చేయించే బాధ్యత ఇరిగేషన్ శాఖకు ప్రభుత్వం అప్పగించింది. గామన్ బ్రిడ్జి అవతల డీ సిల్టేషన్ పాయింట్ల నిర్వహణ బాధ్యతను మైన్స్ డిపార్ట్ మెంట్‌కు అప్పగించింది. గతంలో మాదిరిగా ర్యాంపులకింద కాకుండా రాజమ హేంద్రవరంఅర్బన్, రాజమహేంద్రవర రూరల్, వెంకటనగర్, వాడపల్లి, ఎర్రమ్మహాట్, అరికిరేవుల, దొండగుంటి రేవు, తాళ్లపూడి, ప్రక్కిలంక తదితర డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.268 కోట్ల విలువైన ఇసుక డ్రెడ్జింగ్ ఆర్డర్ పొందిన రాఘవా కన్‌స్ట్రక్షన్ కొనసాగించాలా, వద్దా అనే దానిపై కూడా స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ కంపెనీకి అనుమతిస్తే డ్రెడ్జింగ్ ద్వారా కరవుతీరా ఇసుక తీసే అవకాశం ఉంది. అప్పట్లో అఖండ గోదావరిని డ్రెడ్జింగ్‌తో కుళ్లబొడిచి, పర్యావరణాన్ని దెబ్బతీసిన సంగతి తెలి సిందే. కనీసం ఎంత ఇసుక తవ్వారో, ఎంత అమ్మారో అనే బిల్లులులేకుండా చేశారు. కానీ ఇవాళ అసలు ఇసుక ను ఇరిగేషన్ ఆధ్వర్యంలో తీయించాలా, మైన్స్ ఆధ్వర్యంలో తీయించాలనే విష యం మీద పెద్ద చర్చ జరిగింది. అందుకే అన్ని నిబంధనలు పాటిస్తూ బ్యారేజీ నుంచి ఫోర్త్ బ్రిడ్జి వరకూ ఇరిగేషన్, తర్వాత మైన్స్‌తో పనిచేయ డానికి నిర్ణయించారు. గతంలో మైన్స్‌లేదు.. ఇరిగేషనూ లేదు. వైసీపీ ఇష్టానుసారం జరిగింది. ప్రభుత్వం నుంచి స్పష్టతరాగానే టెండర్లు పిలిచి ఇసుకతీత ప్రారంభించనున్నారు. ఈ వారం మధ్యలో రెండు పబ్లిక్ హాలీడేలు ఉండడంవల్ల వచ్చేవారం వరకూ ఇసుకతీత, సరఫరా ప్రారంభం కాకపోవచ్చు. కానీ రేపోమాపో ఆర్డర్ వస్తే కొంత త్వరగానే ప్రారంభించే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో భవన నిర్మాణదారులు కొంత ఓపిక పట్టాల్సిందే.

ఇసుక కొరత ఇప్పుడే తీరేలా లేదు. నిబంధనల ప్రకారం ఏదైనా పని చేయాలంటే ఎంతకష్టమో ఈ ఇసుక విధానం చూసి అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం నిబంధనలన్నీ తుంగలో తొక్కి అధికా రుల నోటిపై వేలు పెట్టుకోమని బెదిరించి, ఇసుక ఇష్టానుసారం దోచేసి, అమ్ముకుని, రూ.కోట్లు గడించిన సంగతి తెలిసిందే. రూ.కో ట్లు అక్రమాలు జరిగినా ఒక్క అధికారి కూడా మాట్లాడలేదు. ఇవాళ తెలుగుదేశం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయడానికి అనేక నిబంధనలు తెరమీదకు వచ్చాయి. అధికారులు అనేక చట్టాలను వెలికితీసి చూపిస్తున్నారు. అన్ని అనుమతులు ఉంటేనేగానీ ఇసుక తీయలేమని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం కూడా అధికారుల మాటకు విలువ ఇచ్చే. ఒకటి రెండు రోజులు ఆలస్యమై నా పద్ధతి ప్రకారమే ఉచిత ఇసుక అమలు చేసి, ఎక్కడా ఎవరికీ అందలేదనే చెడు రాకుండా చూడాలని స్పష్టంచేస్తోంది.

కాకినాడ జేఎన్టీయూకు

101-150 ర్యాంక్ బ్యాండ్‌లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు

జేఎన్టీయూకే, ఆగస్టు 13: కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ విడుదలచేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2024 ర్యాంకింగ్స్‌లో కాకినాడ జేఎన్టీయూకే విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విభాగంలో 101-150 ర్యాంక్‌బ్యాండ్‌లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను గూర్చి వివరించారు. గతేడాది ఎన్ఐఆర్ఎఫ్- 2023లో కూడా ర్యాంకింగ్స్‌లో వర్సిటీ 101-150 ర్యాంక్‌బ్యాండ్‌లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించిందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 50-100 ర్యాంక్‌బ్యాండ్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు యూనివర్సిటీలోని రెగ్యులర్ అధ్యాపకులకు పూర్తిస్థాయి రీసెర్చ్ స్కాలర్‌ను కేటాయిస్తామని తెలిపారు. విదేశీ విద్యార్థుల ప్రవేశాలను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపడతామని, ఎంటెక్,పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులను మరింత ప్రోత్సహిస్తామని ఫ్యాకల్టీ స్టూడెంట్ రేషియోను పెంచేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. వర్సిటీలో చేపట్టే ప్రతీ కార్యక్రమంలోనూ లింగ సమానత్వాన్ని పాటించడం ద్వారా ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు సాధించవచ్చని రిజిస్ట్రార్ వివరించారు.

బి.ప్రత్తిపాడులో విజిలెన్స్ అధికారుల తనిఖీ

- 31.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పిఠాపురం రూరల్, ఆగస్టు 13: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. వాహనం ద్వారా రేషన్‌బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వ్యాన్‌లో తరలిస్తున్న 31.50 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రేషన్‌బియ్యం విలువ రూ.8.93లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఆకుల గంగరాజుపై పిఠాపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేశారు. విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీల్లో ఎస్ఐ టి.జగన్నాథరెడ్డి, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దారు ఎం.వీరాస్వామి, కానిస్టేబుల్స్ శివ, లోవరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనంలో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కాకినాడ పోర్టులో మరో రెండు చెక్‌పోస్టులు

- పోర్టు కార్మికులకు ఇబ్బంది లేకుండా చర్యలు
- అవినీతి కార్యక్రమాలు జరగకుండా ప్రక్షాళన
- పోర్టు కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా చర్యలు
- రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 13: రోజుకు వెయ్యి నుంచి పదకొండు వందల లారీల బియ్యం ఎగుమతులు అయ్యే విధంగా పోర్టులో మరో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ నగరం ఎమ్మెల్యే వనమాడి కొండబాబులతో కలిసి ఆయన కాకినాడ యాంకరేజ్ పోర్టు కార్యకలాపాలపై సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కాకినాడ పోర్టులో రోజువారీ కార్యాకలాపాలకు ఇబ్బంది లేకుండా, కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోర్టులో అవినీతి కార్యకలాపాలు జరుగకుండా ప్రక్షాళన చేస్తున్నామన్నారు. అదనంగా రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు టెక్నికల్ సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. ఏ ఒక్కరిపై కక్ష లేకుండా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 1.45కోట్ల రేషన్‌కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కాకినాడ యాంకరేజ్ పోర్టును పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేసిందన్నారు. పేదలకు చెందిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రీసైక్లింగ్ చేసి విదేశాలకు తరలించారన్నారు. గతనెలలో జరిగిన దాడుల్లో 50వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. దీనిలో 26వేల మెట్రిక్ టన్నుల బియ్యం కెర్నెల్స్ కల్గిన ఫోర్టిఫైడ్ పీడీఎస్ బియ్యంగా గుర్తించామన్నారు. ప్రభుత్వం కిలో బియ్యం రూ.43కు కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఉచితంగా ఇస్తూంటే ఆ బియ్యాన్ని బియ్యం మాఫియా కిలో ఏడు రూపాయలకు కొనుగోలుచేసి రీసైక్లింగ్ చేసి అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నారని ధ్వజమెత్తారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం కల్గిన 13 మందిపై 6ఏ కేసులతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేశారన్నారు. కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ పోర్టులో కార్యకలాపాలు సక్రమంగా జరిగే విధంగా అన్నిచర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఈనెల ఐదో తేదీన పోర్టులో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ నగరం ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ కాకినాడ పోర్టులో ఎగుమతులు, దిగుమతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తొలుత కలెక్టరేట్‌లో పోర్టు అధికారులు, ఎగుమతిదారులు, లేబర్ యూనియన్లతో సమావేశమయ్యారు. అనంతరం కాకినాడ పోర్టు బొంబాయి గేటు వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ రామ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్, డీసీ లీగల్ మెట్రాలజీ జనార్ధనరావు, ఆర్డీవో కిషోర్, సివిల్ సప్లయిస్ డీఎం బాలసరస్వతి, కాకినాడపోర్టు అధికారి ధర్మశాస్త్ర, డీఎస్పీ హనుమంతురావు, పౌరసంబంధాలశాఖ డీడీ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



అవుట్ గేటు వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

అధికారుల నిర్లక్ష్యం

- నేటికీ బయటకురాని డ్రెడ్జింగ్ నావ
- గేటు మూయడానికి, సాఫ్ట్ లాక్ గేటు ఏర్పాటుకు అడ్డంకిగా మారిన బోటు
- నావ మునిగి 23 రోజులైనా పట్టించుకోని హెడ్‌వర్క్స్ ఈఈ.. ● బ్యారేజీలో తగ్గుతున్న నీరు
- మునిగిన పడవను పరిశీలించిన డెల్టా సీఈ, ఇరిగేషన్ ఎస్ఈ

ధవళేశ్వరం, ఆగస్టు 13: గోదావరి నీటిమట్టం పెరగడంతో లంగరు వేసిన ఇసుక డ్రెడ్జింగ్ నావ ప్రవాహానికి కొట్టుకు వచ్చి కాటన్ బ్యారేజ్ 1వ గేటును ఢీకొట్టి గేటుకు అడ్డంగా మునిగిపోయి 23 రోజులు గడిచినా ఇప్పటికీ నావ అలాగే మునిగి ఉంది. దానిని బయటకు తీయడానికి యజమాని రకరకాలుగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. గోదావరికి వరద ప్రవాహం పెరగడంతో ఇరిగేషన్ అధికారులు ప్రయత్నాలు నిలిపివేశారు. బ్యారేజీ గేటు వద్ద నావ మునిగి గేటును ఆపరేట్ చేయడానికి అడ్డంకిగా మారినా.. బ్యారేజ్‌ను పర్యవేక్షించాల్సిన హెడ్‌వర్క్స్ ఈఈ మొక్కుబడిగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లిపోవడం గమనార్హం. ఈ సంఘటన కలెక్టర్ దృష్టికి వెళ్లి బ్యారేజ్ గేటుకు ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించినా డివిజన్ అధిపతిగా సలహాలు, సూచనలు ఇస్తూ పర్యవేక్షించాల్సిన హెడ్‌వర్క్స్ ఈఈ బ్యారేజ్ సెక్షన్ ఏఈలకు నావను బయటకు తీయించే బాధ్యతను అప్పగించి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోదావరిలో నీరు తగ్గుతూ ఉండటంతో గేట్లను దించి నీటి విడుదలను నియంత్రించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఏ విధంగానైనా అక్కడి నుంచి నావను తీయాల్సిన పరిస్థితుల్లో మంగళవారం ఉదయం డెల్టా సీఈ ఎన్.పుల్లారావు, సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కలిసి నావ మునిగిన ప్రాంతాన్ని పరిశీలించి నావను బయటకు తీయడానికి నావ ఓనర్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఏఈలకు సూచించారు. అలాగే నావను బుధవారం నాటికి బయటకు తీయని పక్షంలో ముక్కలుగా తీసి తొలగించాల్సి ఉంటుందని నావ యజమానులను హెచ్చరించారు.



బ్యారేజీ గేటు వద్ద మునిగిన నావను బయటకు తీయడానికి తీస్తున్న ప్రయత్నాలు



- అవగాహన లేని అధికారులతోనే తంటా

డెల్టాపై అవగాహన లేని అధికారులు డివిజన్లకు అధిపతులుగా రావడంతో వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యల్లో గందరగోళం నెలకొంటుంది. కాటన్ బ్యారేజీ గేట్ల నిర్వహణపై దృష్టిపెట్టకపోవడంతో వరదల సమయంలో గేట్లు మొరాయించిన పరిస్థితులు నెలకొంటున్నాయి

అనుమానం.. పెనుభూతమై

భార్యను హత్య చేసిన భర్త

సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ఘటన



మృతిచెందిన దివ్య భారతి

సీతానగరం, ఆగస్టు 13: ఆమె అందమే ఆమెకు శత్రువైంది. అనుమానపు భర్త చేతిలో హత్యకు కారణమైంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి తన భార్యను దారుణంగా హత్యచేశాడు. స్థానికుల వివరాల ప్రకారం.. దేవీపట్నం మండలం దండంగి గ్రామానికి చెందిన చాట్ల జాను, అంగులూరుకు చెందిన దివ్య భారతి(30) భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో ప్రభుత్వం లోతట్టు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించడంతో జాను కుటుంబం పురుషోత్తపట్నం వచ్చి ఓ కాలనీలో జీవనం సాగిస్తున్నారు. భారతి అందంగా ఉండడంతో మొదటి నుంచి జాను అనుమానం కలిగి ఉన్నాడు. ఈ క్రమంలో ఆమెను ఇబ్బందులకు గురిచేస్తుండడంతో గతంలో ఒకసారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొంతకాలం కోర్టులో నడిచింది. తరువాత పెద్దల మధ్య సర్దుబాటు చేసుకున్నారు. అయినప్పటికీ అనుమానం పోలేదు. భారతి తల్లి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా సేవలు చేసేందుకు వెళతానని భర్తను కోరగా అందుకు ఒప్పుకోలేదు. అయినా తల్లిపై మమకారంతో ఆసుపత్రికి వెళ్లింది. దీంతో మళ్లీ ఇద్దరి మధ్య తగవు జరగడంతో విసిగిపోయిన భారతి తన భర్తతో జీవితం ఇలానే ఉంటుందని ఇక కాపురం చేయలేనని విడాకులకు ప్రయత్నాలు చేపట్టింది. దీంతో ఆగ్రహానికి గురైన జాను మంగళవారం ఉదయం తొర్రిగడ్డ పాత పంపింగ్ స్కీమ్ వద్ద బహిర్భూమికి వెళ్లిన భార్యపై పోటకత్తితో వెనుక నుంచి తల, మెడపై నిర్ధాక్షిణ్యంగా నరికి చంపాడు.ఈ ఘటనపై మృతురాలి తండ్రి సరిపల్లి చిట్టియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ సమర్పణరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

డీజిల్ ట్యాంకర్ నుంచి ఎగసిపడిన మంటలు

- ఆందోళనలో స్థానికులు, డ్రైవర్ పరార్
- అదుపుచేసిన అగ్నిమాపక దళాలు



ట్యాంకర్‌పై మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక దళాలు

తాళ్లరేవు, ఆగస్టు 13: విశాఖపట్నం నుంచి యానాం వస్తున్న డీజిల్, పెట్రోల్ ట్యాంకర్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో మంగళవారం స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు అయ్యప్పస్వామిగుడి ప్రాంతం 216 జాతీయరహదారిపై ట్యాంకర్ వెనుక భాగంలో టైర్లుపేలిపోయి కాలిపోయి మంటలు ఎగసిపడ్డాయి. మంటలను గమనించిన ట్యాంకరు డ్రైవరు పరారై కోరింగ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ ప్రాంతంలో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాకినాడ, జగన్నాథపురం, యానాం, రిలయన్స్ అగ్నిమాపక దళాలు సంఘటనా స్థలానికి చేరుకుని ఫోమ్ రసాయనంతో మంటలను అదుపు చేశాయి. ట్యాంకర్ సాంకేతిక లోపంవల్ల డీజిల్ వాహనం నుంచి భారీగా లీకైంది. దీంతో ప్రత్యామ్నాయంగా బొలేరా వాహనంలోకి డీజిల్‌ను కొంతవరకు తరలించారు. కోరింగ ఎస్ఐ సత్యనారాయణ 216రహదారిపై ట్రాఫిక్‌ను నిలివేసి ప్రయాణికులకు ఎటువంటి అంతరాయం కలుగకుండా తాళ్లరేవు మెయిన్‌రోడ్డుకు వాహనాలను మళ్లించారు. తాళ్లరేవు ఇరుకురోడ్డు కావడం అదే సమయానికి స్కూల్స్ వదలడంతో వాహనాలు ఇరుకురోడ్డులో ఎదురుపడి రాకపోకలు స్తంభించాయి. అగ్నిమాపక బృందాలు, కోరింగ పోలీసులు ఎటువంటి ప్రమాదం జరుగకుండా చర్యలు చేపట్టడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

కుంట ఎస్ఐ సస్పెన్షన్

- విలేకరులపై కుట్ర కోణమే కారణం!

చింతూరు, ఆగస్టు 13: ఛత్తీస్‌గడ్ రాష్ట్రం సుక్మాజిల్లా కుంట పోలీస్ స్టేషను ఎస్ఐ అజయ్ సోంకర్‌పై మంగళవారం కేసు నమోదైంది. వెనువెంటనే ఎస్ఐని సస్పెండ్ చేసినట్లు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ గంగారావ్‌చౌవాన్ పేర్కొన్నారు. విలేకరులను గంజాయి కేసులో ఇరికించడం వెనుక ఎస్ఐ పాత్ర ఉందన్న ఆరోణలు వినవస్తున్నందున పూర్తిస్థాయి విచారణ జరిపిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ముందుగా ఆరోపణలను ఎదుర్కొంటున్న ఎస్ఐని సస్పెండ్‌చేసి కేసు నమోదు చేశామన్నారు. అల్లూరిసీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు సోమవారం ఛత్తీస్‌గడ్‌కు చెందిన నలుగురు వ్యక్తులను గంజాయి కేసులో నిందితులుగా పేర్కొంటూ అరెస్టు చేసిన విషయం విధితమే. కాగా అరెస్టు అయిన నలుగురు వ్యక్తులు కూడా ఛత్తీస్‌గడ్‌లోని వివిధ పత్రికలకు విలేకరులుగా వ్యవహరిస్తున్నారు. విలేకరుల అరెస్టు వెనుక కుంట ఎస్ఐ కుట్ర కోణం దాగి ఉన్నదన్న ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. దీంతో ఛత్తీస్‌గడ్‌లో జర్నలిస్టు సంఘాలు తీవ్ర నిరసనకు దిగాయి. అదే దశలో ఆ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్ళడం జరిగింది. ఇక జర్నలిస్టుల నిరసన గొంతుకు ఆ రాష్ట్ర ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం తన గొంతును కలిపింది. ఇటు మన రాష్ట్రంలో కూడా జర్నలిస్టు సంఘాలు విలేకరులపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదంటూ నిరసన వ్యక్తం చేసింది. ఛత్తీస్‌గడ్ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు చేపట్టిన విచారణలో ఎస్ఐ పాత్ర, కుట్ర ఉందన్న విషయం స్పష్టమైన క్రమంలో కుట్రకు గల కారణాలు ఆ కుట్రలో ఎవరెవరు భాగస్వాములో కూడా తేటతెల్లమయ్యే పరిస్థితి లేకపోలేదన్న అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి.



సుక్మాలో విలేకరుల అక్రమ అరెస్టుని నిరసిస్తూ ఎస్ఐ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జర్నలిస్టు సంఘాలు

రెండు వేర్వేరు కేసుల్లో 80 కేజీల గంజాయి పట్టివేత

మోతుగూడెం, ఆగస్టు 13: ఎస్పీ అమిత్‌బర్ద్ ఆదేశాలతో గంజాయి నిర్మూలనలో రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికలో భాగంగా మోతుగూడెం పీఎస్ పరిధిలో పోలీసులు విస్తృత వాహనాల తనిఖీలుచేసి రెండు వేర్వేరు కేసుల్లో 80 కేజీల గంజాయితో నలుగురు నిందితులను చేసి వారి వద్ద నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మంనకు చెందిన పెంబుల ప్రశాంత్, మదిగొండ్ల మణి సందీపులు 20కేజీల గంజాయి అక్రమంగా తరలిస్తుండగా మోతుగూడెం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని నెమలపాలెం నుంచి భద్రాచలంనకు 60కేజీల గంజాయిని నెమలపాలెంనకు చెందిన నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టువద్ద ఇద్దరు వ్యక్తులు ఒక బైక్ పట్టుకున్నారు. మరో ఇద్దరు బైక్‌పై పరారయ్యారు. ఈకేసులో వరుడు బంగారయ్యతో పాటు ఇంకొక వ్యక్తిని అరెస్ట్ చేశారు. రెండు కేసుల్లో రూ.4లక్షల విలువైన 80 కేజీల గంజాయిని పట్టుకున్నారు. చింతూరు సీఐ గజేంద్రకుమార్ మాట్లాడు తూ చింతూరు సర్కిల్ పరిధిలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఒడిశా, చత్తీస్‌గడ్, తెలంగాణా పోలీసులు కో-ఆర్డినేషన్ చేసుకుంటూ గంజాయి నిర్మూలన చేపడతామని తెలిపారు. తప్పించుకున్న వారిని కూడా పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, మిగతా వారిని రాష్ట్ర పోలీసులను సంప్రదించి పట్టుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలో మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు, ఏఎస్ఐ సూర్యనారాయణరాజు, రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ రాజు, శ్రీను, మురళి, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

'డ్రైన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి'

ప్రత్తిపాడు, ఆగస్టు 13: ప్రత్తిపాడులో ప్రధాన రహదారి వెంబడి డ్రైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను వినతిపత్రం అందజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సూర్యప్రభను మంగళవారం పీసీసీ సభ్యుడు శ్రీను పూల మొక్క, వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రధాన రహదారులు దెబ్బతింటున్నాయని ఆయన చెప్పారు.

కాకినాడ విలీన గ్రామాల ఐక్యవేదిక ఏర్పాటు

సర్పవరం జంక్షన్/కార్పొరేషన్, ఆగస్టు 13: కాకినాడ రూరల్ మండలానికి చెందిన 8 గ్రామాలను అర్బన్‌లో విలీనం చేయడం, గ్రామ పంచాయతీలుగా ఉంచి ఎన్నికలు నిర్వహించడంపై కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కాకినాడ విలీన గ్రామాల ఐక్యవేదిక ఏర్పాటు చేసినట్టు పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు తెలిపారు. మంగళవారం స్థానిక జన్మభూమి పార్కు వద్ద తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, స్వామినగర్ టీచర్స్ కాలనీలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, మాజీ స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ 13 ఏళ్లుగా ఎన్నికలు లేకుండా, కార్పొరేషన్‌లో విలీనం కాకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఈ అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విలీన గ్రామాల ఐక్యవేదిక సమన్వయకర్తగా మాజీ సర్పంచ్ పలివెల వీరబాబును ఎన్నుకున్నారు. గ్రామాల సమస్యల పరిష్కారం కోసం డిప్యూటీ సీఎం పవన్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి కొండబాబుల దృష్టికి తీసుకెళ్లేందుకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు అడ్డూరి ఫణీంద్ర, బి.ప్రసన్నకుమార్, పితాని అప్పన్న, జి.శ్రీనివాసరావు, పాలిక మాధవి, మండా సింహాద్రిరావు, సలాది శ్రీనివాసబాబు, కౌజు నెహ్రూ, ఉదయ భాస్కర్, బుజ్జి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

కరప, ఆగస్టు 13: ఆర్థిక ఇబ్బందులు తాళలేక గుళికలు మందు తాగి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.... కరపలో ఉంటున్న ఇంజరపు సత్యనారాయణ(53) స్థానిక స్వర్ణ థియేటర్ సమీపంలోని 6నెలల క్రితం వెల్డింగ్‌షాప్ పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే అప్పట్నించి తగినంత పని లేక అందినకాడికి అప్పులు చేశాడు. షాపు నడవక, అప్పులు తీర్చే మార్గం కనిపించక మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం షాపు వద్ద గుళికలు మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఇది గమనించిన ఒక బాలుడు బాధితుడి భార్య ఇంజరపు దేవికి సమాచారం అందించాడు. క్షతగాత్రుడ్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఐదు గంటల తరువాత మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జ్ ఎస్ఐ పి.శోభన్‌కుమార్ తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 13: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళాభివృద్ధి శిశుసంక్షేమసాధికారిత అధికారిణి కె.ప్రవీణ ఆధ్వర్యంలో సీడీపీవో జ్యోతి అధ్యక్షతన మాదక ద్రవ్యాల నియంత్రణపై విద్యార్థినీవిద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషనర్ సభ్యురాలు ఆదిలక్ష్మి విచ్చేసి మాట్లాడుతూ విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు,అధికారులు, సిబ్బంది మాదకద్రవ్యాల నియంత్రణపై పర్యవేక్షణ చేపట్టాలన్నారు. అభం శుభం తెలియని వారంత మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నారని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపాయన్, సిహెచ్ వెంకటరావు, డాక్టర్ శ్రీనుచంద్రిక ఉన్నారు.

'వర్మీకంపోస్టుతో అధిక దిగుబడులు'

ప్రత్తిపాడు, ఆగస్టు 13: సంపద కేంద్రాల వద్ద తయారయ్యే వర్మీకంపోస్టుతో వ్యవసాయ సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్ తెలిపారు. మండలంలోని ధర్మవరం సంపద కేంద్రాన్ని మంగళవారం వారు మండల సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలిసి సందర్శించారు. వర్మీకంపోస్టు విధానంలో సంపద కేంద్రం సమీపంలో సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి సాగు చేపట్టిన కూరగాయల పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో శిక్షణా నిర్వాహకుడు లొండా గంగాధర్, సర్పంచ్‌లు మంతెన శ్రీను, గొనగాల అప్పలరాజు, రొంగల నాగేశ్వరరావు, గొండి రాంబాబు, సారిపల్లి లోవలక్ష్మిగంగరాజు, వి.నాగేశ్వరరావు ఉన్నారు.

'ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలి'

సామర్లకోట, ఆగస్టు 13: ప్రతీ ప్రాథమిక పాఠశాల విద్యార్థికి చదవడం, రాయడం రావాలని సామర్లకోట ఎంఈవో వై.శివరామకృష్ణయ్య అన్నారు. మండలంలోని పవర గ్రామంలో ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో సందర్శించారు. విద్యార్థుల పఠనా, రాత నైపుణ్యాలను పర్యవేక్షించారు. ప్రతీ విద్యార్థి తెలుగు, ఆంగ్లంలోనూ అంశాలను చదవడం,రాయడంపై ప్రతీ ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మధ్యాహ్నభోజన పథకం అమలుతీరు పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు. అలాగే ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల క్రీడాపోటీలను తిలకించి విజేతలను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు గోపి, విజయకుమార్ ఉన్నారు.

'యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 13: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఛేంజెస్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ శైలజ కోరారు. మంగళవారం రాజీవ్‌గాంధీ ఎంబీఏ కాలేజీలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ నిర్మూలనపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 11 వరకు హెచ్ఐవీపై కాలేజీలు, గ్రామ సచివాలయాలు, నర్సింగ్ కళాశాలల్లో యువతకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ హరిబాబు, హెచ్‌వో డి.శశికిరణ్, సంస్థ డీఐసీ బుజ్జిబాబు, ప్రాజెక్టు మేనేజర్ దుర్గాభవాని, సూరాడ శివ,కె.సుశీల పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రత్తిపాడు, ఆగస్టు 13: జిల్లాలోని సమగ్ర శిక్ష పార్ట్‌టైమ్ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేయాలని రాష్ట్ర సీఆర్పీల సంఘ అధ్యక్షుడు ఎలిపే రాంజీ ప్రసాద్ చెప్పారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయం వద్ద ప్రసాద్‌ను మంగళవారం ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, శంఖవరం మండలాల సమగ్ర శిక్ష పార్ట్‌టైమ్ ఉద్యోగులు, ఎంఈవోలు వి.రాజబాబు, వై.అచ్చిరాజులు ఘనంగా సన్మానించారు. టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సత్యప్రభ, టీడీపీ నేతలు రాంజీని సన్మానించారు.

అచ్చంపేట గ్రామ శివారున గ్యాస్ మంటలు

సామర్లకోట, ఆగస్టు 13: సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామ శివారు శ్మశానవాటిక వద్ద ఏడీబీ రోడ్డు జంక్షన్ వద్ద ఒక ప్రైవేట్ గ్యాస్ కంపెనీకి చెందిన పైప్‌లైన్ జాయింట్ల నుంచి మంగళవారం ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. ఏడీబీ రోడ్డు నుంచి అచ్చంపేట, గొంచాల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే కావడంతో గ్యాస్ మంటలు ఎగజిమ్ముతున్న కారణంగా ఆ రోడ్డున వెళ్లే పలు వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే ప్రమాదానికి గురైన గ్యాస్ పైప్‌లైన్ సంస్థకు సమాచారం ఇచ్చేందుకు పలువురు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో తిమ్మాపురం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు.

రేపు రక్తదాన శిబిరం

కరప, ఆగస్టు 13: తలసేమియా బాధితులను ఆదుకునేందుకు యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతంచేయాలని ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ కోరారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం రక్తదాన శిబిర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కాకినాడ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో ఈనెల 15న మధ్యాహ్నం గాంధీనగర్‌లోని రెడ్‌క్రాస్ భవనమందు ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ, గ్రీన్‌కోర్ కమిటీ సభ్యురాలు శారద, ముమ్మిడి పుష్పలత తదితరులు ఉన్నారు.

ఆకతాయి బాలురకు దేహశుద్ధి

సామర్లకోట, ఆగస్టు 13: సామర్లకోట ఈటీసీ కాలనీ వద్ద బాలికలను అసభ్యపదజాలంతో వేధిస్తున్నారన్న ఆరోపణల మేరకు కాలనీవాసులు వేధింపులకు పాల్పడిన ఇద్దరు మైనర్ బాలురు దేహశుద్ధి చేసిన సంఘటన సామర్లకోటలో మంగళవారం రాత్రి జరిగింది. వారికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిర్వహించేందుకు తీసుకెళ్లగా వైద్యసిబ్బంది నిరాకరించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సిందిగా సూచించారు. ఈ సంఘటనపై ఏ ఫిర్యాదులు అందలేదని సామర్లకోట పోలీసులు తెలిపారు.

బీజేపీ నాయకుల సమావేశం

జగ్గంపేట, ఆగస్టు 13: మండల బీజేపీ నాయకుల సమావేశం జగ్గంపేటలో మండలాధ్యక్షుడు మేడిశెట్టి వీరబాబు అధ్యక్షత మంగళవారం జరిగింది. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై కార్యకర్తలకు జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ట మంగరాజు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. జగ్గంపేట అసెంబ్లీ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ, విశ్వకర్మ యోజన జిల్లా సెక్రటరీ వీరబాబు, మండల కార్యదర్శి పల్లా రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు అడపా దొరబాబు, కొత్త శ్రీనివాస్ రెడ్డి నరేంద్రపట్నం, కోరుమిల్లి నాగేశ్వరరావు తదితరులున్నారు.

బత్తాయిలతో అలంకారం



గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 13: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉన్న అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణి నవమి సందర్భంగా మంగళవారం పూజలు నిర్వహించారు. అపర్ణాదేవిని బత్తాయి ఫలాలతో అలంకారం చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

హర్ ఘర్ తిరంగా...

జిల్లాలో పలుచోట్ల జాతీయ జెండాలతో ర్యాలీలు
పాల్గొన్న నాయకులు, విద్యార్థులు







సర్పవరం జంక్షన్: పందూరులో జాతీయ పతాక ఊరేగింపు, పిఠాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ, కొత్తపల్లిలో ర్యాలీ

పిఠాపురం, ఆగస్టు 13: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభించి ప్రధాన రహదారుల మీదుగా ఉప్పాడ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ మానవహారాన్ని నిర్మించారు. కళాశాల నూతనభవనంపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఉషశ్రీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ యువీబీటీ కృష్ణప్రసాద్, కె.ఆనంద్, సీహెచ్. పద్మావతి పాల్గొన్నారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పట్టణంలోని పాదగయ సెంటర్ వద్ద నుంచి ప్రదర్శన చేపట్టారు. జాతీయ జెండాలతో పిఠాపురం నుంచి గొల్లప్రోలు వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కార్యక్రమ ఇన్‌చార్జి గుండ్ర అరుణ్‌కుమార్, బీజేపీ కాకినాడ జిల్లా పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, పెండెం సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, కో కన్వీనర్ వాసంశెట్టి శ్రీనివాస్, పిఠాపురం పట్టణ అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, టౌన్ ఇన్‌చార్జి అల్లుబోయిన సూరిబాబు, తోట ఏడుకొండలు, బుర్రి మరళీధరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: ప్రతీ ఇంటా జాతీయ జెండాను ఎగురవేయాలని సీసీఆర్‌టీ రిసోర్సుపర్సన్ కేవీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. ఉప్పాడ, కొత్తపల్లి జిల్లా పరిషత్ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులతో ఉన్నత పాఠశాలల నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ఉప్పాడ బీచ్‌రోడ్డు వరకు జెండాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించారు. బాలురబాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.రమణమూర్తి, కే.అన్నపూర్ణ, సీసీఆర్‌టీ ట్రైనీలు దాకే అప్పలరాజు, ఎస్ బెన్ జాన్సన్, బాలవేదిక కన్వీనర్ నూలు జయరాజు, చిత్రలేఖన ఉపాధ్యాయుడు పవన్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు రవిరాజు, పద్మశ్రీ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు కోరారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండలాధ్యక్షుడు నండూరి సత్తిబాబు ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులు ఆవిష్కరించిన భారీ జాతీయ పతాకాన్ని గ్రామంలో ఊరేగించారు. సలాది అనిల్‌కుమార్, పితాని లీలావతి, విద్యాకమిటీ చైర్మన్ బల్ల సుధాకర్, కవికొండల చలపతి, వలవల సూరన్న, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కాకినాడఅర్బన్: ఆజాద్‌కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జిల్లా క్రీడా పాధికారసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సీఈవో బి.శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో 3000మంది క్రీడాకారులు క్రీడామైదానం నుంచి జేఎన్టీయూ మీదుగా నాగమల్లితోటవరకు ర్యాలీ చేశారు. క్రీడా శిక్షకులు వి.రుద్ర, సురేష్, పి.అప్పలనాయుడు, ఎండీ ఆలీషరీఫ్, మి.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

కార్పొరేషన్(కాకినాడ): కాకినాడ సిటీ వెస్ట్ మండలంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఉదయ భానుజీ అధ్యక్షతన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది. గోదావరి జోన్ ఇన్‌చార్జి సాలగ్రామ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో సుమారు 200మంది విద్యార్థులు జాతీయపతాకం చేతబూని వందేమాతర నినాదాలతో భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సర్వేశ్వరరావు, సూర్యనారాయణమూర్తి, అనిల్, ప్రసాద్ ఉన్నారు.

తొండంగి: పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలతో ప్రదర్శన జరిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ మాట్లాడారు. కార్యక్రమంలో టి.రాము, దివాకర్ మహాలక్ష్మినాయుడు, నారాయణరావు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధే లక్ష్యం

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ఎమ్మెల్యేను కలిసిన విద్యా కమిటీల సభ్యులు

ప్రత్తిపాడు, ఆగస్టు 13: పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా నూతనంగా ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు (ఎస్ఎంసీ) కమిటీలు పనిచేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. నియోజకవర్గంలోని ఉత్తరకంచి, పెద్దనాపల్లి, ధర్మవరం, జె.అన్నవరం, తూర్పు లక్ష్మీపురం, పైడిపాల, రౌతులపూడి గ్రామాలకు చెందిన విద్యాకమిటీలు మంగళవారం ప్రత్తిపాడు విచ్చేసి సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేయగా విద్యాకమిటీలను ఎమ్మెల్యే అభినందించారు. సత్యప్రభ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పాఠశాలల విద్యాకమిటీ ఎన్నికలు పూర్తయినందున పాఠశాల అభివృద్ధిపై కమిటీలు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, యాళ్ల జగదీష్, మంతెన శ్రీను, దాట్ల అప్పన్నబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

పెద్దాపురం, ఆగస్టు 13: ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో జె.సీతారామారావు తహశీల్దార్లను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం డివిజన్ పరిధిలోని 11 మండలాల తహశీల్దార్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల నియోకవర్గం ఓటరు జాబితా తయారీ, పీజీఆర్ఎస్, సీసీఆర్సీ కార్డులు, మ్యూటేషన్స్, సమరీ రివిజన్ ఎలక్షన్ రోల్స్ తదితర అంశాలతో పాటు పలు రెవెన్యూ సమస్యలపై సమీక్షించారు. దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్.వెంకటలక్ష్మీ, కార్యాలయ డీటీ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రత్తిపాడు, ఆగస్టు 13: మండలంలోని పెదశంకర్లపూడి గ్రామంలో మాసా ఆదినారాయణ (48) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అయితే ఆదినారాయణను హతమార్చారు అంటూ అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో మాసా ఆదినారాయణ మాసా నూకరత్నంలు దంపతులు. అయితే వేరే కులానికి చెందిన మహిళతో ఆదినారాయణ వివాహేతర సంబంధం నేపథ్యంలో అతడిని హతమార్చారు అంటూ అతని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆదినారాయణ ప్రియురాలు ఇంటి సమీపంలోనే మంగళవారం ఉదయం ఆదినారాయణ మృతిచెంది పడి ఉన్నాడని, అతడి కుటుంబ సభ్యులు ఇది ముమ్మాటికి హత్యే అని చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ పరిశీలించారు. మృతుడి భార్య నూకరత్నం ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ప్రత్తిపాడు ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పెదశంకర్లపూడిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ పవన్‌కుమార్, కుటుంబ సభ్యులు

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప



అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన చినరాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 13: పేదల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఈనెల 16న అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో స్థానిక మున్సిపల్ సెంటర్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. నిరుపేదలు 3పూటలా పట్టెడన్నం తినేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇప్పటికే భవనాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను నిర్వీర్యం చేసిందని, దీంతో పేదలు ఆకలితో అలమటించారన్నారు. పేదలకు రూ.5కే కడుపునిండా టిఫిన్, భోజనం అందించాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం అన్నారు. కార్మికులు, దినసరి కూలీలతో పాటు ఎంతోమంది ఆకలిని అన్న క్యాంటీన్‌లు తీర్చేవన్నారు. పట్టణంలో పూర్తి స్థాయిలో అన్నక్యాంటీన్ భవనాన్ని సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులన ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, విత్తనాల వెంకటరమణ, నూనే రామారావు, తూతిక రాజు, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ఆదినానారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం

ఆసుపత్రి అభివృద్ధికి దాతల సహాయ సహకారాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యులు ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్యసేవలను అందించాలన్నారు. నాణ్యమైన వైద్యసేవలు కేవలం ప్రభుత్వాసుపత్రిలోనే లభిస్తాయన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి కావాల్సిన నిధులను తీసుకొచ్చి కృషి చేయనున్నట్టు తెలిపారు. ఆసుపత్రికి కావాల్సిన పరికరాలు, మౌలిక సదుపాయాలను దాతల సహకారాలతో సమకూర్చనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్‌చంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ముప్పన రామారావు కళ్యాణ మండపంలో కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు)ను సంఘ నేతల ఆధ్వర్యంలో పూలమాలలు,దుశ్శాలువాలతోఘనంగా సత్కరించారు.

సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వని కార్యదర్శులు

సుంకరపాలెం సర్పంచ్ ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

తాళ్లరేవు, ఆగస్టు 13: పంచాయతీల్లో కార్యదర్శులు స్థానిక సర్పంచ్‌లకు కనీస సమాచారం కుడా ఇవ్వకుండా ఏమితెలియనివ్వడం లేదని సుంకరపాలెం సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకిశపూడి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పి.మల్లవరం డంపింగ్‌పార్క్ వద్ద ఏర్పాటుచేసిన రెండోరోజు సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమం సమాచారం కూడా చెప్పలేదని పంచాయతీ అధికారులపై సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీలో ఏం జరిగినా, ఎటువంటి విషయమైన సర్పంచ్‌కి తెలియాలని ఆటువంటిది సర్పంచ్‌లు ప్రమేయం లేకుండా కార్యదర్శులు పనులు చేసుకుంటూ పోతున్నారని ఆరోపించారు. మండల పంచాయతీ అధికారి ఎమ్.భైరవమూర్తి మాట్లాడుతూ సర్పంచ్, కార్యదర్శి సమానంగా పయనించిననాడే అభివృద్ధి ముందుకు సాగుతుందని అన్నారు. విధులు, విధానాలు తదితర విషయాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బందికి ఈవోపీఆర్డీ అవగాహన కల్పించారు.

రెండోరోజు శిక్షణ

ఏలేశ్వరం, ఆగస్టు 13: సంపద కేంద్రాల ద్వారా పంచాయితీలకు ఆదాయం సమకూర్చవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రెండోరోజు సర్పంచ్‌లు, కార్యదర్శులకు యర్రవరం సంపద కేంద్రంలో శిక్షణ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ సంపద కేంద్రాల వద్ద తడి చెత్త, పొడి చెత్త ప్రణాళికాబద్ధంగా వేరు చేసి పంచాయితీలకు ఆదాయాన్ని సమకూర్చవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు తదితరులున్నారు.

అవయవదానంపై అవగాహన

సర్పవరం జంక్షన్, ఆగస్టు 13: స్థానిక సాయి భార్గవ స్కానింగ్ సెంటర్‌లో కాకినాడ ఐడీఏ, ఐఎంఏల ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడ ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ చిట్ల కిరణ్, రాష్ట్ర ఐడీఏ సీడీహెచ్ కన్వీనర్ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ మరణించిన, బ్రెయిడ్ డెడ్ అయిన వారి అవయవాలు,కణజాలాలు దానం చేయవచ్చన్నారు. అవయవ దానంతో 9 మంది క్లిష్టమైన ఆరోగ్య పరిస్థితుల్లో ఉన్న వారికి జీవదానం చేసిన వారవుతారన్నారు. ప్రతీ ఒక్కరూ అవయవ దానంపై అవగాహనతో ఎందరికో ప్రాణదానం చేయాలని కోరారు. అవయవ దానం పత్రాలుఅందించిన వారికి ప్రసంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకన్న, రేడియాలజిస్ట్ డాక్టర్ భాస్కర్‌లు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి'



ర్యాలీలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

పిఠాపురం, ఆగస్టు 13: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల జరిగే దుష్పరిణామాలపై ప్రజలకు, చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో దుర్గాదేవి సూచించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగ్గయ్యచెరువు కాలనీలో గల అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా మార్టులు అభివృద్ధి చేస్తాం

పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్



మహిళామార్టును పరిశీలిస్తున్న వీరపాండ్యన్

కిర్లంపూడి, ఆగస్టు 13: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో మహిళా మార్టులను పరిశీలిస్తున్నామని, అమరావతిలో జరిగే సమీక్షలో మార్టుల పనితీరు, వివరాలు వెల్లడించడం జరుగుతుందని పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్ తెలిపారు. కిర్లంపూడిలో మహిళా మార్టులో ఉన్న స్టాక్‌ను ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడుతూ మహిళామార్టులను మరింతస్థాయికి పెంచేందుకు పరిశీలిస్తున్నామన్నారు. మార్టుల నిర్వాహణపై సభ్యులను అడిగి తెలుసుకుంటున్నామని, కొనుగోలుదారుల అవసరాలు తీర్చేందుకు వీటిని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆయన వెంట ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీరమణి, డీపీఎం బాబురావు, వీబీ రాయ్, ఏపీఎం శ్రీనివాస్, గ్రూప్ సభ్యులు పి.ఎస్తేరురాణి, సంధ్యారాణి, ఆదిలక్ష్మి, మార్ట్‌మేనేజర్ వై.అఖిల్ ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన



రౌతులపూడిలో భోజనం పరిశీలిస్తున్న అధికారులు

రౌతులపూడి, ఆగస్టు 13: రౌతులపూడి హైస్కూలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఎంఈవోలు శ్రీనివాసరావు, గాడి కొండబాబు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం.. తినలేకపోతున్నాము పట్టించుకోండి అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు వారు స్పందించి భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయుడు కే.రాంబాబును వివరణ కోరగా భోజనం బాగోలేదని వచ్చిన వార్త వాస్తమేనన్నారు. కొన్నిరోజులు సక్రమంగా వస్తుందని, కొన్నిరోజులు బాగోవడం లేదని తెలిపారు. భోజనం నాణ్యతగా ఉండడంలేదని అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఏజెన్సీవారు పట్టించుకోవడంలేదన్నారు. సుమారు 800 మంది పిల్లలు ఉన్నప్పటికి కేవలం 200 నుంచి 300 మాత్రమే భోజనం చేస్తున్నట్టు తెలిపారు. భోజనం బాగోకపోయిన బాగుందని విద్యార్థులపై ఒత్తిడి తేవడం అవాస్తమన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

గండేపల్లి, ఆగస్టు 13: మల్లేపల్లి హైస్కూల్ ఆవరణలో ఉన్న ఉమెన్ ఇంటర్ కళాశాల విద్యార్థులకు కూటమి నాయకుల ఆర్థిక సాయంతో హెచ్ఎం సుధామాధురి ఆధ్వర్యంలో సుమారు 49మందికి యూనిఫాంలు పంపిణీ చేశారు. దాతలకు హెచ్ఎం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు తెలగారెడ్డి భద్రరావు, కాటేపల్లి వీరభద్రం, విద్యాకమిటీ చైర్మన్ కంచర్ల సుబ్రహ్మణ్యం, గ్రంధి నాగ సుబ్రహ్మణ్యం, బలిరెడ్డి గంగరాజు, దార్లంక నూకరాజు, కొల్లు త్రిమూర్తులు, లంక శ్రీను, చింతపల్లి వీరభద్రరావు, కలిమి శ్రీను, వల్లభశెట్టి కోటేశ్వరరావు, తలారి ధర్మరాజు ఉన్నారు.

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

గండేపల్లి, ఆగస్టు 13: ఈనెల 11న కాకినాడ పీఆర్ కాలేజీలో జరిగిన అండర్-23 అథ్లెటిక్స్ జిల్లా సెలక్షన్ ట్రయల్స్‌లో ఆదిత్య ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ నుంచి 11మంది అథ్లెట్లు హాజరవ్వగా 9మంది సెప్టెంబర్ 14, 15, 16న గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో జరగనున్న స్టేట్ మీట్‌లో పాల్గొనడానికి అర్హత సాధించారని డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులను అభినందించారు.

తుమ్మలపల్లిని కలిసిన రాంజీ

జగ్గంపేట, ఆగస్టు 13: జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌ని ఏపీ సీఆర్పీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.రాంజీప్రసాద్, జిల్లా సీఆర్ఎంటీలు మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీఆర్ఎంటీల సమస్యలు వివరించారు. తుమ్మలపల్లి మాట్లాడుతూ సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

యనమల రామకృష్ణుడు పరామర్శ

తొండంగి, ఆగస్టు 13: అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స చేయించుకున్న జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు మాకినీడి గాంధీని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు మంగళవారం కృష్ణాపురంలో పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, కొయ్యా రామకేశవ, కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, అరిగెల నర్సింహమూర్తి, కందా మురళి, పాలచర్ల యర్రబ్బు ఉన్నారు.

జీవ వైవిధ్యంపై లఘుచిత్రం

కోటనందూరు, ఆగస్టు 13: జీవ వైవిధ్యంపై లఘుచిత్రం రూపొందించిన కోటనందూరు హైస్కూల్ విద్యార్థులను అభినందించారు. పదోతరగతి విద్యార్థులు అవినాష్, పూర్ణిమ, భార్గవ్, స్వామి దుర్గాప్రసాద్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కే.విరబద్రరావు ఈ లఘుచిత్రాన్ని కాకినాడ జేఎన్టీయూకేలో ప్రదర్శించగా జిల్లా స్థాయిలో ద్వితీయస్థానం సాధించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈవో శ్రీనివాస్, రామశేఖర్, హెచ్ఎమ్ రామకృష్ణ తదితరులు అభినందించారు.



లఘుచిత్రాన్ని రూపొందించిన విద్యార్థులు